# పన్నెండవ పాఠం

# الدرس الثاني عشر

## 2- దైవదూతల పై విశ్వాసం

## الإيمان بالملائكة

**ఈమాన్ ముజ్మల్:** అంటే ఒక ముస్లిం సంక్షిప్త రూపంలో అల్లాహ్ దూతల గురించి ఇలా విశ్వసించాలి: అల్లాహ్ వారిని పుట్టించాడు. వారి స్వభావంలోనే విధేయతనుంచాడు. వారిలో అనేకానేక రకాలు గలవు. 'అర్ష్' (అల్లాహ్ సింహాసనము)ను మోసేవారు, స్వర్గనరక భటులు, మానవుల కర్మలను భద్రపరుచువారు.

**ఈమాన్ ముఫస్సల్:** అంటే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎవరి పేర్లతో సహా ఏ వివరాలు తెలిపారో వారిని అలాగే విశ్వసించాలి. ఉదాః జిబ్రీల్, మీకాఈల్, నరక పాలకుడు మాలిక్, శంకు ఊదే బాధ్యత కలిగి ఉన్న దూత ఇస్రాఫీల్.

అల్లాహ్ వారిని కాంతితో పుట్టించాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారని, ఆయిషా రజియల్లాహు అన్హా ఉల్లేఖించారుః **"అల్లాహ్ దూతలు నూర్ (కాంతి)తో పుట్టించబడ్డారు. జిన్నాతులు అగ్ని జ్వాలలతో మరియు ఆదము ముందే మీకు ప్రస్తావించబడిన దానితో (మట్టితో) పుట్టించబడ్డారు".** (ముస్లిం 2996).

## 3- గ్రంథాల పై విశ్వాసం

## الإيمان بالكتب

**ఈమాన్ ముజ్మల్:** అంటే గ్రంథములపై సంక్షిప్తంగా ఇలా విశ్వసించుట విధిగా ఉంది: అల్లాహ్ తన ప్రవక్తలపై గ్రంథాలను అవతరింపజేశాడు. వారు వాటి ద్వారా తమ జాతివారి అల్లాహ్ హక్కు వారిపై ఏముందో తెలియజేస్తూ, వారిని అల్లాహ్ ఆరాధన వైపునకు పిలిచారు.

**ఈమాన్ ముఫస్సల్:** అంటే అల్లాహ్ ఏ గ్రంథముల పేర్లు తెలిపాడో వాటిని వివరంగా విశ్వసించాలి. ఉదా: ప్రవక్త మూసా అలైహిస్సలాంపై 'తౌరాత్', ప్రవక్త దావూద్ అలైహిస్సలాంపై 'జబూర్', ప్రవక్త ఈసా (యేసు క్రీస్తు) అలైహిస్సలాంపై 'ఇంజీల్' మరియు అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై 'దివ్య ఖుర్ఆన్'లు అవతరింపజేశాడు. అన్నిట్లో ఖుర్ఆన్ అతిగొప్పది మరియు చిట్టచివరిది. అది పూర్వ గ్రంథాలను రుజువు పరుచునది మరియు పరిరక్షించునది. దానిని అనుసరించుట, దాని ప్రకారమే తీర్పులు చేయుట తప్పనిసరి. అల్లాహ్ దానిని హృదయాల వ్యాధులకు స్వస్థతగా, ప్రతి విషయాన్ని విశదపరిచేదిగా మరియు సర్వలోకాల కొరకు మార్గదర్శకత్వంగా మరియు కారుణ్యంగా చేశాడు. అల్లాహ్ ఆదేశం: **మరియు ఇది (ఈ ఖుర్ఆన్) మేము అవతరింపజేసిన ఒక శుభప్రదమైన గ్రంథం. కాబట్టి మీరు దీనిని అనుసరించండి. భయభక్తులతో మెలగండి. తద్వారా మీరు కరుణించబడే అవకాశం ఉంది.** (అన్ఆమ్ 6:155). **మేము నీపై ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము. అందులో ప్రతి విషయం విశదీకరించబడింది. విధేయత చూపేవారికి (ముస్లింలకు) అది మార్గదర్శకం, కారుణ్యం, శుభవార్త.** (నహ్ల్ 16:89).

## 4- ప్రవక్తల పై విశ్వాసం

## الإيمان بالرسل

**ఈమాన్ ముజ్మల్:** ప్రవక్తలపై సంక్షిప్తంగా ఇలా విశ్వసించాలి: అల్లాహ్ ప్రతి జాతిలో ప్రవక్తను పంపాడు, వారు ఏకైక అల్లాహ్ ఆరాధన వైపునకు ప్రజలను ఆహ్వానించారు, అల్లాహ్ తప్ప ఇతరుల ఆరాధన నుండి వారించారు. ప్రవక్తల్లో ఏ ఒక్కరినీ తిరస్కరించినా అందరినీ తిరస్కరించడంతో సమానం. అల్లాహ్ ఆదేశం: **{మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము: 'అల్లాహ్ ను ఆరాధించండి. మిథ్యా దైవాల ఆరాధనకు దూరంగా ఉండండి'}.** (సూరె నహ్ల్ 16: 36).

ప్రవక్తల్ని విశ్వసించినవారే సాఫల్యం పొందువారు. వారిని తిరస్కరించినవారే నష్టం, అవమానం పాలయ్యేవారు.

ప్రవక్తలందరి పిలుపు ఒక్కటేనని మనం విశ్వసించాలి. అది: "అల్లాహ్ ఏకత్వం మరియు సర్వ ఆరాధనల్లో ఆయన్ని అద్వితీయునిగా నమ్మటం". అయితే వారికి నొసంగబడిన ధర్మశాస్త్రాలు, ఆదేశాలు, శాసనాలు వేర్వేరుండవచ్చు. అల్లాహ్ కొందరికి మరి కొందరిపై ఘనత ప్రసాదించాడు. అందరిలోకెల్లా గొప్ప ఘనతగల మరియు చిట్టచివరి, అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. అల్లాహ్ ఆదేశాలుః **{మేము కొందరు ప్రవక్తలకు మరికొందరు ప్రవక్తల కంటే ఉన్నత స్థానాలను ఇచ్చాము}.** (సూరె బనీ ఇస్రాఈల్ 17: 55). **మరో చోట ఇలా ఆదేశించాడుః {(మానవులారా!) ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రి కారు. కాని ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త, దైవప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు}.** (33: అహ్ జాబ్: 40).

**ఈమాన్ ముఫస్సల్:** అంటే ఏ ప్రవక్తల పేర్లతో సహా అల్లాహ్ లేక ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారో వారిని అదే వివరంగా విశ్వసించాలి. ఉదా: నూహ్, హూద్, సాలిహ్, ఇబ్రాహీం, వగైరా ప్రవక్తలు. అల్లాహ్ వారందరిపై అనేకానేక దయాకరుణా మేఘాలు కురిపిస్తూ ఉండుగాకా! ఆమీన్.